సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం । 5 । మార్చి । 2025



పక్కాగా పక్కదారి

రేషన్ బియ్యం మాఫియా పక్కాగా అక్రమ రవాణాకు పాల్పడుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-25 (బుధవారం సాయంత్రం)

సహర్ 5-21 (గురువారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.8 /19.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చివరి ఇండెంట్ నీటిని విడుదల చేయండి

శాంతినగర్: ఆర్డీఎస్, కేసీ కెనాల్ వాటాగా రావాల్సిన చివరి ఇండెంట్ నీటిని విడుదల చేయాలని కోరుతూ ఉమ్మడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చీఫ్ ఇంజినీర్లు తుంగభద్ర బోర్డుకు మంగళవారం లేఖలు రాశారు. తెలంగాణ నీటిపారుదలశాఖ సీఈ జి.అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదలశాఖ సీఈ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం టీబీ బోర్డుకు లేఖలు రాశారు. ఐదో చివరి ఇండెంట్ ఆర్డీఎస్ వాటాగా రావాల్సిన 1.057 టీఎంసీల నీటిని తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) నుంచి విడుదల చేయాలని, అంతేగాక కేసీ కెనాల్ వాటాగా రావాల్సిన 1.61 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలిపారు. బుధవారం నుంచి (5 – 13 వరకు) తొమ్మిది రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కోరారు. ఎనిమిది రోజుల పాటు 1500 క్యూసెక్కులు, ఒక రోజు 233 క్యూసెక్కులు చొప్పున విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు. ఉమ్మడి ఇండెంట్ వాటా నీటితో కేసీ, ఆర్డీఎస్ రైతులకు సాగునీరందుతుందని సీఈలు తెలిపారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,620

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో మంగళవారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.6,620, కనిష్టంగా రూ.5,191 ధరలు లభించాయి. అనుములు రూ.6,752, ఉలువలు రూ.5,610, రాగులు రూ.3,305, కందులు గరిష్టంగా రూ.6,899, కనిష్టంగా రూ.6,127, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,381, కనిష్టంగా రూ.2,111, ఆముదాలు గరిష్టంగా రూ.6,062, కనిష్టంగా రూ.5,981 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,011, కనిష్టంగా రూ.5,989, కందులు గరిష్టంగా రూ.6,859గా ఒకే ధర పలికింది.

సివిల్స్ కోచింగ్‌కు ఒప్పందం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ–పీజీ అటానమస్ కళాశాలలో చదివే విద్యార్థినులకు సివిల్స్‌లో కోచింగ్ ఇచ్చేందుకు 21వ శతాబ్దపు ఐఏఎస్ అకాడమీ (హైదరాబాద్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఇరుపక్షాల వారు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం 400 మంది విద్యార్థినులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి ఐదేళ్లపాటు యూపీఎస్సీ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఉచిత మాస్టర్ తరగతులు 12 సెషన్స్‌గా ఆఫ్‌లైన్ (ప్రతి సెషన్‌కు రెండు గంటల చొప్పున) లో కోచింగ్ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.వి.రాజేంద్రప్రసాద్, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డా.పద్మ, వైస్ ప్రిన్సిపాల్ అమీనాముంతాజ్ జహాన్, కో–ఆర్డినేటర్ అనిత, 21వ శతాబ్దపు ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్, డైరెక్టర్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇది చారిత్రాత్మక తీర్పు



గద్వాలటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి సంచలన విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందారు. ఆయన ఎన్నిక పట్ల బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు ఇచ్చిన ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని స్థానిక బీజేపీ నాయకులు పట్టణ ప్రధాన రోడ్లపైకి చేరుకొని సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, ర్యాలీ నిర్వహించారు. సంబరాలు అనంతరం అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు, పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై కుట్రలు చేసినా బీజేపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారన్నారు.

ఎన్నికపై హర్షం..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ బలపరిచిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) అభ్యర్థి మల్కా కొమరయ్య ఎన్నిక పట్ల ఆ సంఘం నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేష్, మల్లికార్జున్, ప్రవీణ్, నాగరాజు, రత్నాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మహేందర్, మురళీధర్‌రెడ్డి, భానుప్రకాష్, సమరసింహారెడ్డి, రవి, రాధాకృష్ణరెడ్డి, కృష్ణకుమార్‌లు హర్షం తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల ఆకాంక్షల సాధనకు కృషి చేస్తారన్నారు.ఏ ఆకాంక్షల కోసమైతే, ఉపాధ్యాయులు గెలిపించారో.. వాటి సాధనకు తపస్ కృషి చేస్తుందన్నారు.

నిఘా నీడలో పరీక్షలు

మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు



గద్వాలలోని ఓ జూనియర్ కళాశాలలో నంబర్లను పరిశీలిస్తున్న ఇంటర్ అధికారులు

- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- 14 కేంద్రాలు.. హాజరుకానున్న 8,341 మంది విద్యార్థులు
- నేటి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ వార్షిక పరీక్షలు

గద్వాలటౌన్: ఇన్నాళ్లు తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టిన ఇంటర్ విద్యార్థులు ఇప్పుడు పరీక్షలు సజావుగా రాస్తేనే మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుంటుంది. ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటికే ఆయా కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇదిలాఉండగా, నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్లు నర్సింగరావు, లక్ష్మీనారాయణ సంబంధిత శాఖల అధికారులతో ఇప్పటికే ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగనున్నాయి. మాల్ ప్రాక్టీస్, చూచి రాతలు, ఒకరికి మరొకరు పరీక్ష రాయడం, ఇన్విజిలేటర్లు విధుల దుర్వినియోగం తదితర వాటికి తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

14 కేంద్రాలు.. 8,341 మంది విద్యార్థులు

జిల్లాలో అన్ని వసతులు కలిగిన 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 8 ప్రభుత్వ కళాశాలలు, మిగిలినవి ప్రైవేటువి. మొదటి సంవత్సరంలో 4,057 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 3,260 మంది విద్యార్థులు జనరల్ పరీక్షలు, 797 మంది ఒకేషనల్ పరీక్షలు రాయనున్నారు. ద్వితీయ సంవత్సరంలో 4,284 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో జనరల్ పరీక్షలు 3,396 మంది, ఒకేషనల్ పరీక్షలకు 715 మంది, 173 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారు. మొత్తం 8,341 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు. గద్వాలలో ఆరు, అయిజలో మూడు పరీక్షా కేంద్రాలతో పాటు అలంపూర్, మానవపాడు, ధరూరు, మల్దకల్, గట్టు ప్రభుత్వ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 'పతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంట్ అధికారిని ఏర్పాటు చేశారు. గద్వాలకు, అయిజలకు కస్టోడియన్‌ను నియమించారు. 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు.

వసతుల కల్పన..

విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఎండ తాకిడి తట్టుకోవడానికి వీలుగా పరీక్ష కేంద్రాల ఆవరణంలో టెంట్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రతి పరీక్ష కేంద్రంలో ముగ్గురు చొప్పున ఆరోగ్య కార్యకర్తలను నియమించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో సమయానికి చేరుకునే విధంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. జిల్లాలో ఏ ఒక్క విద్యార్థి సైతం కింద కూర్చోకుండా బెంచీలను ఏర్పాటు చేశారు. పక్కా భవనాలు కలిగిన చోటనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది, తాగునీరు ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

నిర్దేశించిన సమయానికి చేరుకోవాలి



విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాలలో పనిచేసే సిబ్బంది, అధికారులు, ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డును తమ వద్ద ఉంచుకోవాలి. సెల్‌ఫోన్లను ఎవరూ పరీక్ష సమయంలో ఉపయోగించొద్దు. – హృదయరాజు, డీఐఈఓ, గద్వాల

తనిఖీకి స్క్వాడ్ బృందాలు

మాస్ కాపీయింగ్ నిరోధానికి రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో సీనియర్ లెక్చరర్‌తో పాటు రెవెన్యూ అధికారి, ఓ ఏఎస్‌ఐ ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు కేంద్రాలను పరిశీలిస్తూనే ఉంటారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, జిరాక్స్ దుకాణాల మూసివేత, పోలీసు భద్రతల నడుమ పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎవరికి కూడా సెల్‌ఫోన్ వాడే అవకాశం ఇవ్వడం లేదు. విద్యార్థులు తప్పకుండా ఉదయం 8 గంటలకు పరీక్షా కేంద్రాలకు వచ్చేలా ప్రణాళిక ఉంచుకోవాలని ఇంటర్మీడియట్ అధికారులు సూచిస్తున్నారు. 8.30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇస్తారు. నిమిషం నిబంధనను కొంత సడలించినారు. అయిదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు విద్యార్థిని అనుమతించాలని ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో పనిచేసే సిబ్బంది, అధికారులు, ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా గుర్తింపుకార్డును తమ వద్ద ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

చారిత్రక కట్టడాలను పునరుద్ధరించాలి



ఎర్రవల్లి పరీక్ష కేంద్రం వద్ద వసతులపై ఆరా తీస్తున్న కలెక్టర్ సంతోష్

- గద్వాల కోట, లింగంబావిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలటౌన్: సంస్థానాదీశుల కాలం నాటి కోట, లింగంబావిని పునరుద్ధరించి, సుందరీకరణ పనులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి చారిత్రక నిర్మాణాలు, కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిత్రక కట్టడాలను పునరుద్ధరించి, భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గద్వాల కోటను పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మరమ్మతులు, శుభ్రత, భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. కోట, లింగంబావిల పునరుద్ధరణ కోసం డీపీఆర్ తయారుచేయాలని ఆర్కిటెక్ట్ అధికారులను ఆదేశించారు. కట్టడాన్ని స్థిరంగా నిలిపేందుకు సరైన నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. లింగంబావి పరిసర ప్రాంతాలు ఆకర్షణగా ఉండేందుకు ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆర్కిటెక్ట్ అధికారిణి శ్రీలేఖ పాల్గొన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్– 2025 నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో ఉన్న గద్వాల ఎస్ఆర్ విద్యానికేతన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి కలెక్టర్ సంతోష్ క్షేత్రస్థాయి పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాలలో ఉన్న వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. నీట్–2025 నిర్వహణకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘనీ, కోఆర్డినేటర్ వెంకటేష్, ప్రిన్సిపాల్స్ రాముడు, నందిని తదితరులు పాల్గొన్నారు.

సరైన వసతులు కల్పించాలి

ఎర్రవల్లి: జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ యూజీ–2025 నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో నీట్ పరీక్ష జరిగే సరస్వతి పాఠశాల కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గదుల వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, వెంటిలేషన్, తదితర అంశాలను పరిశీలించి పాఠశాల యాజమాన్యానికి అవసరమైన సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తగినంత సీటింగ్ సామర్థ్యం ఉండేలా చూడాలని, సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత, టాయిలెట్ వంటి వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌గని, కోఆర్డినేటర్ వెంకటేష్, ప్రిన్సిపల్ నందిని పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప

గద్వాల క్రైం: వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బ బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప అన్నారు. మంగళవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేసవి నేపథ్యంలో పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరగనున్నాయని ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందని, అందులో భాగంగా వైద్యులు, సిబ్బంది రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే, అవసరమయ్యే మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వాటిని నిల్వ ఉంచుకోవాలన్నారు. ఎవరైన రోగులు, వారికి అందించే వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. వడదెబ్బకు గురైన వారి వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరించాలన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో అనారోగ్య భారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, తరచూ నీరు తాగాలని, చిన్నారులు, వృద్ధులు మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు బయట తిరగకపోవడమే మంచిదని అన్నారు. సమావేశంలో వైద్యులు సంధ్యా కిరణ్‌మై తదితరులు ఉన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కొత్తకోట: ఈ నెల 14న పౌర్ణమిని పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచలం దైవ క్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఈ నెల 12న రాత్రి 8 గంటలకు వనపర్తి బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని వివరించారు. ఈ యాత్ర మూడు రోజుల పాటు కొనసాగుతుందని, 13వ తేదీన కాణిపాకం, అదేరోజు సాయంత్రం వెల్లూర్ గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకోవచ్చని చెప్పారు. 14వ తేదీన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శనానంతరం సాయంత్రం 4 గంటలకు తిరిగి బయలుదేరుతుందని పేర్కొన్నారు. అడ్వాన్సుగా సీట్ బుక్ చేసుకోవాలనుకుంటే సెల్‌నంబర్ 94906 96971 సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు



కొత్తకోట రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగడం చాలా ముఖ్యమని.. నాబార్డ్ అందిస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ మహబూబ్‌నగర్ క్లస్టర్ డీడీఎం మనోహర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాలలో నాబార్డ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక బలోపేతంతో గ్రామాలు గొప్పగా ఎదుగుతాయన్నారు. అనంతరం మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని.. అన్నిరంగాల్లో రాణించే శక్తి వారి సొంతమని కొనియాడారు. వ్యవసాయ రంగంలో విత్తనం పొలంలో నాటిన దగ్గర్నుంచి పంట ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయించే వరకు మహిళల పాత్ర కీలకమన్నారు. వ్యవసాయంలో రోజు రోజుకు మహిళల ప్రాధాన్యం పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పారు. అనంతరం ఉత్తమ మహిళా రైతులు, ఉత్తమ స్వయం సహాయక బృందాల మహిళలను విద్యార్థులు, ప్రొఫెసర్లు సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ డీఆర్డీఓ భాస్కర్, వనపర్తి లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, కళాశాల ఉమెన్ సెల్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జ్ డా. ఆర్.పూర్ణిమా మిశ్రా, డా. విద్య, డా. గౌతమి, నవ్య, శ్వేత, ఏఈఓ రమేష్‌కుమార్, విద్యార్థినులు, స్వయం సహాయక బృందాల మహిళలు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆచూకీ లభించేనా.?

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరం
- ఎట్టకేలకు కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ
- ఎలాంటి సమాచారం బయటికి పొక్కనివ్వని అధికారులు



సొరంగంలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సహాయక బృందాలు



సహాయక బృందాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు

అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ ప్రశ్నార్థకంగా మారింది. రోజూ విడతల వారీగా ప్రత్యేక బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నా.. సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ మాత్రం లభించడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు సైతం ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యలకు సంబంధించి ఎలాంటి సమాచారాన్ని బయటకు పొక్కనివ్వకుండా జాగ్రత్తలు పడుతున్నారు. షిఫ్టుల వారీగా సొరంగంలోకి వెళ్లి వచ్చిన వారు కూడా సమాచారం అందించడం లేదు. కాగా, సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో నీటి ఊట రోజురోజుకూ పెరుగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. లోకో ట్రైన్‌లో సహాయ బృందాలు 13.5 కిలోమీటర్లు వెళ్లడానికి సుమారు 2 గంటల సమయం పడుతోందని.. అక్కడికి వెళ్లి గంట పాటు పనులు చేసి బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. టీబీఎం మెషీన్ విడి భాగాలను రైల్వే సిబ్బంది గ్యాస్ కట్టర్‌తో తొలగిస్తున్నారు.

ఫోరెన్సిక్ బృందం రాక..

సొరంగంలో సహాయక బృందాలకు దుర్వాసన వస్తుందని.. మట్టి తవ్వకాల్లో ఎముకలు బయటపడ్డాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా ఫోరెన్సిక్ బృందం సొరంగ ప్రాంతానికి చేరుకోవడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది.

ఉన్నతాధికారుల సమీక్ష..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. టన్నెల్ ఇన్ లెట్ ఆఫీస్ వద్ద రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న బృందాల అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ పురోగతి, ఎదురవుతున్న సవాళ్లు, మైనింగ్, ఫైర్ సర్వీసెస్, ర్యాట్ మైనింగ్ ప్రత్యేకతలు, ప్లాస్మా కట్టర్స్ వినియోగం వంటి అంశాలపై చర్చించారు. కన్వేయర్ బెల్టును పునరుద్ధరించిన కారణంగా గంటకు 800 టన్నుల మట్టిని బయటకు తీసుకురాగలమని అధికారులు వెల్లడించారు. గ్రౌండ్ పేనిట్రేటింగ్ రాడార్ ద్వారా మానవ అవశేషాలను గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని.. కన్వేయర్ బెల్టు ద్వారా వీలైనంత త్వరగా మట్టిని బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అదేవిధంగా రెండు ఎస్కలేటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మిషన్ చివరి భాగాలను గ్యాస్ కట్టర్ ద్వారా తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకురానున్నట్లు చెప్పారు. సహాయక బృందాలకు అవసరమైన ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కాగా, సహాయక చర్యలను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ డీజీపీ నాగిరెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. సమావేశంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ప్రసన్న తదితరులు ఉన్నారు.

అందుబాటులోకి కన్వేయర్ బెల్టు..

సొరంగంలో టీబీఎం మెషీన్‌తో పాటు పనిచేసే కన్వేయర్ బెల్టు ధ్వంసమైంది. దీంతో సొరంగంలో పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లను బయటికి తరలించేందుకు ఇబ్బందులు తలెత్తాయి. సింగరేణి కార్మికులు పదుల సంఖ్యలో సొరంగంలోకి వెళ్లి పనులు చేసినప్పటికీ పురోగతి కనిపించలేదు. మట్టి, నీరు, బురదను బయటకు పంపడానికి శ్రమతో కూడుకున్న పనిగా మిగిలింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 3:30 గంటలకు కన్వేయర్ బెల్టును పునరుద్ధరించారు. అయితే ప్రమాదం జరగకముందు సొరంగంలో జరిగిన పనులకు సంబంధించిన మట్టి, రాళ్లు కన్వేయర్ బెల్టుపై ఉండటంతో, వాటిని మాత్రమే బయటికి తరలించారు.

■ భూ ప్రకంపనలు, భూమిలో ప్రయాణించే ప్రత్యాస్తి తరంగాలను అధ్యయనం చేసే నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం ఢిల్లీ నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకుంది. ఈ బృందం పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. సొరంగం కుప్పకూలిన ప్రదేశంలో అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఉన్నతాధికారులతో వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

క్లుప్తంగా

బావిలో పడి వృద్ధురాలు మృతి

చిన్నచింతకుంట: బావిలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చిన్నచింతకుంట మండలం గూడూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్ లాల్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అమరచింత మండలం మస్తిపురం గ్రామానికి చెందిన ఇంకోలా గుండమ్మ (77) గత నెల 28న అమవాస్య సందర్భంగా కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చింది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ పరిసరాలలో అక్కడ ఇక్కడ తిరుగుతూ పలువురికి కనిపించింది. మంగళవారం కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. గూడూరు గ్రామ శివారులోని అబ్దుల్ ఖాదర్ వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హీర్లతండాలో సోమవారం రాత్రి చోటు చేసుకోగా.. మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం ఖిల్లాఘనపురం మండలంలోని హీర్లతండాకు చెందిన పాత్లావత్ హరిచంద్, వాలీబాయి భార్యభర్తలు. సోమవారం ఇంటి వ్యవహారంలో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనోవేదనకు గురైన హరిచంద్ రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంట్లో పైపుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే గమనించిన బంధువులు, కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఖిల్లాఘనపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై మృతుడి భార్య వాలీబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బద్రునాయక్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

బల్మూర్: బాలికను లైంగికంగా వేధించిన ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్యపై ఏఎస్పీ సీహెచ్ రామేశ్వర్ పోక్సో కేసు నమోదు చేసినట్లు షీటీం జిల్లా ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం చెంచుగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలికను ప్రధానోపాధ్యాయుడు 20 రోజుల క్రితం లైంగికంగా వేధించాడని.. బాలిక కాళ్లపై పడి వేడుకున్న వినిపించుకోలేదని వివరించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు తిరుపతయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై టీడీటీఓ ఆదేశాల మేరకు ఏటీడీఓ సోమవారం ఆశ్రమ పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: పుర పరిధిలోని ఉయ్యాలవాడ ఎస్‌బీఐ ఏటీఎంలో ఓ వ్యక్తికి చోరీకి యత్నించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం మేరకు.. బిజినేపల్లి మండలం లింగసానిపల్లికి చెందిన నారాయణ ఉయ్యాలవాడలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నిస్తుండగా అలారం మోగడంతో బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని నారాయణను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బ్యాంక్ మేనేజర్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

హైనా దాడిలో లేగ దూడ మృతి

- భయాందోళనలో రైతులు
- పట్టింపులేని అధికారులు

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన జగ్గని వెంకటయ్య తన వ్యవసాయ పొలంలో సోమవారం సాయంత్రం గేదెలను కట్టేసి ఇంటికి తిరిగి వచ్చాడు. ఉదయం పొలానికి వెళ్లి చూడగా గుర్తు తెలియని జంతువు దూడను చంపి తిన్న విషయం గుర్తించాడు. ఘటనపై ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. స్థలాన్ని పరిశీలించిన అధికారులు హైనా దాడి చేసి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ పొలం వద్ద సాయంత్రం పశువులు, గేదెలను కట్టివేసి ఇంటికి వస్తే తెల్లారే సరికి దూడలను హైనా అనే అడవి జంతువు చంపి తింటుంది. దీంతో వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే రైతులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఇలా పలు ఘటనలు జరిగినా ఫారెస్టు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఇలానే గుర్తు తెలియని జంతువులు ఆవు, గేదె దూడలను చంపి తింటున్నాయని పలువురు అంటున్నారు. దూడలను చంపింది హైనా అయి ఉంటుందని ఫారెస్టు అధికారులు అంచనా వేస్తున్నారే తప్పా.. ఖచ్చితంగా విషయం తెలుపడం లేదని, దానిని పట్టుకునేందుకు అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఇకనైనా దూడలను చంపి తింటున్న గుర్తు తెలియని జంతువును పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

పక్కాగా పక్కదారి

- సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
- జోరుగా అక్రమ రవాణా
- పట్టుబడ్డా.. నామమాత్రపు చర్యలు
- రెచ్చిపోతున్న రేషన్ మాఫియా
- యథేచ్ఛగా కొనసాగుతున్న దందా
- పట్టించుకోని అధికారులు



కోస్గిలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

గండేడ్/మహమ్మదాబాద్: రేషన్ బియ్యం అక్రమ రవాణా పక్కాగా సాగుతోంది. పట్టుబడ్డ నామమాత్రపు చర్యలు ఉండటంతో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. గండేడ్ మండలంలోని సల్కర్‌పేట్‌లో ఓవ్యాపారి ఇటీవల దుకాణం తెరిచాడు. ఇక్కడ అతను నూకలు, జొన్నలు, రాగులు, వేరుశనగ వంటి వాటిని కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నా అతను చేసేది మాత్రం పక్కా రేషన్ బియ్యం అక్రమ దందానే. గత సోమవారం మూడు క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. సదరు వ్యాపారి మాత్రం వారు పట్టుకుంటూనే ఉంటారు మేము దందా చేస్తూనే ఉంటాం. ఇది షరామామూలే.. అంటూబాహాటంగా చెప్పడం విశేషం.

■ నంచర్లగేటులో ముగ్గురు వ్యాపారులు నిరంతరం రేషన్ దందా కొనసాగిస్తున్నారు. తరచూగా పట్టుబడ్డ వారి వ్యాపారంలో మార్పు లేదు. ప్రతినెల బియ్యం సేకరించి కోస్గిలోని రేషన్ మాఫియాకు అందజేస్తారు. వారు అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

■ గండేడ్ మండలంలో ఓ మాజీ సర్పంచ్ రేషన్ బియ్యం అక్రమ దందాకు తెరలేపాడు. మహమ్మదాబాద్‌ను, గండేడ్ మండలంలోని పలు గ్రామాలను స్థావరంగా చేసుకొని దందా చేస్తున్నాడు. ఇటుక బట్టీల లేబర్లకు బియ్యం కావాలని చెబుతూ సేకరించిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నాడు. ఇతను ఇటుకబట్టీల లేబర్ పేరు చెబుతున్నా ఇతను ప్రస్తుతం ఇటుకలు తయారు చేయకపోవడం గమనార్హం.

■ మొకర్లాబాద్‌కి చెందిన ఓవ్యాపారి కూడా రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్నాడు. ఎక్కువగా ఇతను గిరిజనతండాల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తూ పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

కేసులు నమోదు చేశాం



ఇప్పటి వరకు పలుచోట్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశాం. రేషన్ బియ్యం తరలింపుపై ప్రజలు సమాచార అందిస్తే బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటాం. ఎక్కడైన రేషన్ బియ్యం తరలిస్తున్నట్లయితే సెల్ నంబర్ 9866629460కు సమాచారం ఇవ్వండి.

– ఆదిత్య గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, మహబూబ్‌నగర్

సాఫీగా సాగుతున్న వ్యాపారం

రేషన్ మాఫియా యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పట్టుబడ్డా కఠినచర్యలు లేకపోవడంతో ఈ అక్రమ వ్యాపారం సాఫీగా సాగుతోంది. గ్రామాల్లో వ్యాపారులు సేకరించిన బియ్యం సరిహద్దులు దాటుతున్నాయి. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రాలకు తరలుతున్నాయి. కొత్లాబాద్ పగిడ్యాల్ రూట్లో రెగ్యులర్‌గా ఓ వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. మహమ్మదాబాద్, నంచర్ల, సల్కర్‌పేట్, గండేడ్ నుంచి కోస్గి, దౌల్తాబాద్‌లకు చెందిన వ్యాపారులు ఇక్కడి వ్యాపారులతో కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని అక్కడి నుంచి రాష్ట్రం దాటవేస్తున్నారు.

ప్రధాన కూడళ్లలో అడ్డాలు

రేషన్ బియ్యం వ్యాపారం చేసేవారు ప్రధాన గ్రామాల కూడళ్లలో అడ్డాలు పెట్టుకున్నారు. నంచర్ల, సల్కర్‌పేట్, మహమ్మదాబాద్, నంచర్లగేట్, పగిడ్యాల్ గ్రామాల్లో అడ్డాలున్నాయి. ఒక్క కొండెడ్డిపల్లిలోనే 8 నుండి 10 మంది వరకు అక్రమ వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. ప్రజల నుంచి కిలోకు రూ.10 చొప్పున సేకరించి వారు బయట కిలో రూ.20 వరకు అమ్ముకుంటున్నారు.

మంచి డిమాండ్

మార్కెట్లో రేషన్ బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. పౌల్ట్రీ ఫారాల్లో దాణగా ఉపయోగించడంతో పాటు, బీర్ల, కల్లు, టిఫిన్ల తయారీలో సైతం వీటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా అక్రమ వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. ఇందుకు అధికారులు అండదండలు మెండుగా ఉన్నాయి. క్రమం తప్పకుండా మామూళ్లు అందుతున్నట్లు సమాచారం.



నంచర్ల గేటులో ధాన్యం సేకరణ పేరుతో వెలసిన దుకాణం

మాలలు ఉద్యమానికి సిద్ధం కావాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్
- అలంపూర్‌లో మాలల సమావేశం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పల్లి సుధాకర్

అలంపూర్: రాష్ట్రంలోని మాలలు భవిష్యత్ తరాల కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మాలల భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాలలను అణగదొక్కి రిజర్వేషన్లు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్ 341 ప్రకారం లోక్‌సభలో మెజార్టీ ఎంపీలతో వర్గీకరణ చేయాల్సి ఉందన్నారు.

విభజించే కుట్ర..

ఎస్సీ వర్గీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎందుకు అనుకూలంగా ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా తనకు ఇష్టం వచ్చినట్లు ఎస్సీల రిజర్వేషన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీలను విభజించి వారిలో ఐకమత్యం దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని షమీ కమిటీ నివేదిక కాపీలను అసెంబ్లీలో ఉన్న 119 మంది ఎమ్మెల్యేలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాలల సంఖ్య తక్కువగా చూపించి ఎస్సీ వర్గీకరణ చేయడం సరికాదన్నారు. ఎస్సీలలో ఉన్న 59 ఉపకులాల్లో ఏ కులం ఎంతమంది ఉన్నారో తెలుసుకోవాల్సి బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో మాదిగల కంటే మాలలే అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. త్వరలోనే జోగుళాంబ అమ్మవారి క్షేత్రం నుంచే మాలల ఉద్యమాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రాజన్న, హరీశ్, రవికుమార్, రజిని బాబు, రాజు, నాగరాజు, ప్రేమలత తదితరులు ఉన్నారు.

పట్టుబడ్డ ధాన్యంపై విచారణ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన విజిలెన్స్ అధికారులు

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద సోమవారం సాయంత్రం పట్టుబడిన ఆరు లారీల ధాన్యానికి సంబంధించి మంగళవారం విజిలెన్స్ స్పెషల్ ఆఫీసర్ శశిధర్ విచారణ చేపట్టి స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం, ఈ ప్రాంత మిల్లర్లు సేకరించిన వరి ధాన్యం కానీ కర్ణాటకకు తరలిస్తే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో సరిహద్దులో తాము నిఘా ఉంచి అక్రమంగా ధాన్యం తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుబడ్డ లారీల్లో ప్రభుత్వం అందించిన గన్నీ బ్యాగులు ఉండడంతో పాటు వాటికి సరైన ధ్రువపత్రాలు లేనందున వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.



పట్టుబడ్డ లారీలను కృష్ణా పోలీసులకు అప్పగించిన విజిలెన్స్ అధికారులు

క్షుద్రపూజలు, బాలిక బలి పూర్తి అవాస్తవం

- సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు నమ్మొద్దు
- డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్



డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

బిజినేపల్లి : బంగారం నిధుల కోసం తవ్వకాలు, బాలిక నరబలి అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు అవాస్తమని డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టెం గ్రామ సమీపంలోని రాంరెడిపల్లితండాలో ఈ వార్తలపై డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి వార్తలను నమ్మొద్దని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జైపాల్, తిరుపతి అనే వ్యక్తులు వ్యవసాయ కుటుంబాలకు చెందినవారని, కొద్దిరోజుల కిందట బోరుబావి పాయింట్ చూపించడం కోసం ఒక వ్యక్తి సంప్రదించారన్నారు. ఆ బోరు పాయింట్ చూసే వ్యక్తి పుట్టను చూపించి అక్కడ బంగారం లభించే అవకాశముందని చెప్పడంతో వారు బంగారం కోసం గత శనివారం పుట్టను తవ్వారు. తండా వాసులు వారిని గుర్తించి పట్టుకొని వారించి పంపించినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో పెద్దమనుషులు డబ్బులు తీసుకున్నారనే విషయం అవాస్తవమని న్నారు. ఇదిలా ఉంటే జైపాల్, తిరుపతిపై కేసు నమోదు చేసిన్నట్లు డీఎస్పీ తెలిపారు. సంచనాల కోసం సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు రాసే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీలు సంఘటితం కావాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

బిజినేపల్లి: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన బీసీలంతా ఐక్యం కావాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంఘం సూర్యారావు పిలుపునిచ్చారు. మంగళవారం బిజినేపల్లి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ చైతన్య మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీసీలు సంఘటితం కావాలన్నారు. బీసీలు కమిటీల ద్వారా పటిష్టంగా ఉండాలని, భవిష్యత్ తరాలకు వెన్నుగా ఉండేలా కమిటీల నిర్మాణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యమ నేత వట్టి జానయ్య యాదవ్, కుర్మయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌సాగర్, చంద్రశేఖర్, వెంకటేష్‌యాదవ్, వెంకట్‌స్వామి, రామన్‌గౌడు, అల్లోజీ తదితరులు పాల్గొన్నారు.

బావాజీ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



జాతర ఏర్పాట్లపై అధికారుల సమీక్షలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూరు/కొత్తపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం గురులోకామాసంద్ ప్రభు (బావాజీ) ఉత్సవాలు ఏప్రిల్ 11 నుంచి 14 వరకు కొనసాగనున్నాయని.. జాతరకు వచ్చే గిరిజన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలోని ఆలయ ఆవరణలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలంతో కలిసి జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతర ప్రాంగణంలో మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం 80 మరుగుదొడ్లు ఉన్నాయని మిషన్ భగీరథ ఈఈ రంగారావు వివరించారు. అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని, అలాగే మహిళలు దుస్తులు మార్చుకోవడానికి 10 గదులు నిర్మించాలని కలెక్టర్ సూచించారు. వేసవి దృష్ట్యా భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. 210 మంది కార్మికులను సెక్టార్ల వారీగా విభజించి పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు డీపీఓ కృష్ణ వివరించారు. జాతరలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఐడీ కార్డులు ఇవ్వాలని, భక్తులు సమర్పించిన నైవేద్యాలు ఎప్పటికప్పుడు తొలగించేందుకు, ట్రాక్టర్ వెళ్లడానికి రహదారి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రథోత్సవం జరిగేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా చూస్తామని.. ఇందుకోసం అదనంగా 20 స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. ఉత్సవాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవాదాయశాఖ నుంచి 30 మంది సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గతేడాది రథోత్సవం సమయంలో పోలీసు బందోబస్తు సరిగా లేదని ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఉత్సవాల పర్యవేక్షణకు కలెక్టరేట్ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం గురులోకామాసంద్ ప్రభు, కాళికాదేవిని ఆమె దర్శించుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ రాంచందర్, జెడ్పీ సీఈఓ భాగ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ డా. సౌభాగ్యలక్ష్మి, పీఆర్ ఈఈ హీర్యానాయక్, మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

మండల కాంప్లెక్స్ నిర్మాణ స్థల పరిశీలన..


కొత్త మండల కేంద్రం కొత్తపల్లిలో రూ.8.80 కోట్లతో నిర్మించే మండల కాంప్లెక్స్ భవన నిర్మాణానికి మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్థల పరిశీలన చేశారు. వెయ్యి గజాల స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణ నమూనాను చూసి ప్రధాన రహదారి నుంచి కాంప్లెక్స్ వరకు రహదారి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

కోయిల్‌సాగర్ నుంచి నీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నాలుగో తడికి నీటిని విడుదల చేశారు. యాసంగి పంటల సాగుకు ఇప్పటి వరకు మూడు తడులు నీటిని విడుదల చేయగా, ప్రస్తుతం నాలుగో తడికి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని వదిలారు. 9 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 22.10 అడుగుల మేర నీటి మట్టం ఉంది. నీటి విడుదలకు ముందు ప్రాజెక్టులో 31.6 అడుగులుగా నీటి మట్టం ఉండగా, ఇప్పటి వరకు 8.8 అడుగుల నీటి మట్టం తగ్గింది. ప్రస్తుతం వదిలిన నీటి విడత పూర్తి అయితే మరింత నీటి మట్టం తగ్గే అవకాశం ఉంది.

విరామం ఇస్తూ నీటి విడుదల..

కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగి సాగుకు విరామం ఇస్తూ తడులుగా నీటిని విడుదల చేస్తున్నారు. డిసెంబర్ 25 నుంచి విడతల వారీగా నీటిని యాసంగి పంటలకు వదులుతున్నారు. ఇప్పటి వరకు మూడు తడులు పూర్తి కాగా, నాలుగో తడికి రెండు రోజుల నుంచి నీటి విడుదల చేస్తున్నారు. ప్రకటించిన షెడ్యూల్ కన్న రెండు రోజులు ముందుగానే నీటిని విడుదల చేశారు. తడి తరువాత చివరగా 5వ తడి కింద నీటిని విడుదల చేయాల్సి ఉంది.



కోయిల్‌సాగర్ కుడి కాల్వలో పారుతున్న నీరు

ఆహార పంటలకు మోతాదులోనే ఎరువులు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: యాసంగిలో ఆహార పంటలను సాగు చేసే రైతులు రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకూడదని పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మంగనూర్ శివారులో యాసంగి ఆహార పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డా.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆహార ధాన్యం పంటలు సాగు చేసే రైతులు ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులను వినియోగించడం వలన ఆహారం విషతుల్య అవుందన్నారు. ప్రస్తుత యాసంగిలో వేరుశనగ, మొక్కజొన్న, వరి వంటి పంటలను ఎక్కువగా సాగు చేశారని, వాణిజ్య పంటల సాగు తక్కువ విస్తీర్ణంలో చేపట్టారన్నారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్, రైతులు పరశురాములు, కొండన్న తదితరులు ఉన్నారు.

వేర్వేరుగా తడి, పొడి చెత్త సేకరణ

- సీడీఎంఏ సీడీఓ హేమలత
- 9 మున్సిపాలటీల అధికారులకు శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని సీడీఎంఏ కార్యాలయ సీడీఓ (కంపోస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) హేమలత సూచించారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులకు మంగళవారం కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని డంపింగ్ యార్డులో శిక్షణఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పట్టణాలలోని ఫంక్షన్ హాళ్లు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో వదిలేసే కూరగాయలు, ఇతర వ్యర్థ ఆహార పదార్థాల (తడి చెత్త) ను ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. పెద్దమొత్తంలో డంపింగ్ యార్డుకు తరలించిన అనంతరం అక్కడ తడి చెత్త కుళ్లిపోయేందుకు ఇనాక్యులమ్ ద్రావణంవేసి ఎరువు (విండ్రో కంపోస్టు)గా మార్చాలన్నారు. స్వచ్ఛ ఆటోల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు.మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సేకరించిన కూరగాయలు, వ్యర్థ పదార్థాలను పరిశీలిస్తున్న సీడీఓ, మున్సిపల్ కమిషనర్లు

ఇంట్లో చోరీ

- రూ.1.30 లక్షలు అపహరణ

పాన్‌గల్: ఇంటి తాళాలు ధ్వంసం చేసి నగదు అపహరణ చేసిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన బేగిని ఆంజనేయులు గొర్రెల కాపారిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 3న భార్యతో కలిసి గొర్రెలు మేపేందుకు వ్యవసాయ పొలాలకు వెళ్లారు. భార్య వెంకటమ్మ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు ధ్వంసమై ఉన్నాయి. ఇంట్లో బీరువా కూడా ధ్వంసం కావడంతో ఆమె విషయాన్ని వెంటనే భర్తకు ఫోన్ ద్వారా చెప్పింది. భర్త ఇంటికొచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ.1.20 లక్షలు, 20 తులాల వెండి గొలుసులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. నగదు, నగలు కలిపి మొత్తం రూ.1.30 లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బేగిని ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి తాగుతూ పట్టుబడ్డ యువకుడు

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు గుట్టుగా గంజాయి తాగుతుండగా.. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐ ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్ బాలానగర్ శివారులోని ఓ పైపుల కంపెనీలో పనిచేస్తూ మండల కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కమలేష్ గంజాయి తాగుతున్న విషయాన్ని ఇంటి పక్కలవారు గమనించి మంగళవారం రాత్రి బాలానగర్, రాజాపూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది యువకుడిని అదుపులోకి తీసుకుని ఇంటిలో సోదాలు చేశారు. ఇంటిలో గంజాయి లభించకపోవడంతో కమలేష్‌కు అదుపులోకి తీసుకుని గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుందనే కోణంలో విచారిస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.